ఇంటర్ తెలుగు పరీక్షకు 60 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు సోమవారం 60 మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ కుమార్ సోమవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్త ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షలో భాగంగా మండలంలోని డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 639 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 579 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు. డాక్టర్ ఎం.జి.ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94 మందికి 84 మంది హాజరు కాగా 10 మంది, తార కళాశాలలో 174 మందికి 152 మంది హాజరు కాగా 22 మంది, గురుకుల పాఠశాలలో 203మందికి గాను 186 మంది హాజరు కాగా 17 మంది గైర్హాజరయ్యారు.

బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సర్వత్రా ఉత్కంఠ

- కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు
- రాత్రి 8 గంటలకు కట్టలు కట్టడం పూర్తి
- కౌంటింగ్ ఆలస్యంతో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో టెన్షన్
- పోలైన పోస్టల్ ఓట్లు 243లో 201 చెల్లుబాటు
- రౌండ్‌కు 28 వేల ఓట్ల చొప్పున 8 రౌండ్లలో కౌంటింగ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠ రేపుతోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మందకొడిగా సాగడంతో టిడిపి, పిడిఎఫ్ నేతలు, కార్యకర్తల్లో టెన్షన్ నెలకొంది. సోమవారం ఉదయం ఏడు గంటలకు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లను తెరిచారు. బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ గదిలోకి చేర్చి ఉదయం ఎనిమిది గంటలకు లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 28 టేబుల్స్ ఏర్పాటు చేయగా ప్రతి రౌండ్‌లోనూ 10 నుంచి 13 వేల ఓట్లకు సంబంధించి కట్టలు కట్టడం ప్రారంభించారు. చెల్లుబా టు, చెల్లుబాటు కానివాటితో సంబంధం లేకుండా 50 ఓట్ల చొప్పున కట్టలుగా కట్టారు. పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 35 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు మొదలుపెట్టిన కట్టలు కట్టే ప్రక్రియ రాత్రికి 17 రౌండ్లలో పూర్తయ్యింది. ఆ తర్వాత ప్రాధాన్యతా ఓట్ల క్రమంలో లెక్కింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. మంగళవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో లెక్కింపు పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మూడు షిఫ్టులుగా మొత్తం 700 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు నిరంతరం కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరినీ తనిఖీ చేసి పాసులు ఉన్నవారిని మాత్రమే లోపలికి పంపించారు.

కృష్ణా, గుంటూరు స్థానంలో వేగంగా.. ఇక్కడ ఆలస్యంగా.. ★★★

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. అక్కడ సైతం సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు మొదలైంది. అక్కడ 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా దాదాపు 3.40 లక్షల ఓట్లు పోలయ్యాయి. అక్కడ ఓట్ల లెక్కింపు వేగంగా జరగడంతో సాయంత్రం ఐదు గంటల నుంచి రౌండ్లవారీగా ఫలితాలు ప్రకటించడం ప్రారంభమైంది. ఇక్కడ మాత్రం కట్టలు కట్టడానికే దాదాపు 12 గంటల సమయం పట్టింది. దీంతో అక్కడ వేగంగా జరగడానికి, ఇక్కడ ఆలస్యం జరగడానికి కారణాలు ఏమిటని ప్రశ్నలు అందరినీ తొలిచేశాయి. కౌంటింగ్ ప్రక్రియ మందకొడిగా సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. రాత్రి ఎనిమిది గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవ్వడంతో ఏజెంట్లు, అభ్యర్థులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. మొత్తం 28 టేబుల్స్ ఉండగా ప్రతి రౌండ్‌కూ టేబుల్‌కు వెయ్యి చొప్పున 28 వేల ఓట్లు లెక్కించనున్నారు. మొత్తం ఎనిమిది రౌండ్లలో పూర్తిస్థాయి ఫలితం వెలువ డనున్నట్లు అధికారులు చెబు తున్నారు. పూర్తిస్థాయి ఫలితం వచ్చేటప్పటికి సమ యం ఎక్కువ పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

పోస్టల్ ఓట్లు 201 చెల్లుబాటు ★★★

పోస్టల్ ఓట్లకు సంబంధించి 408 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 243 మందే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 201 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 42 ఓట్లు చెల్లుబాటు కానివిగా తేల్చారు. ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌లో దాదాపు 27 వేల మంది ఉద్యోగులు, మూడు వేలకు మందికిపైగా పోలీసులు పాల్గొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవాల్సి ఉంది. అయితే కేవలం 243 మందే ఓటు హక్కు వినియోగించుకోవడం చర్చనీయాంశమైంది.

బ్యాలెట్ బాక్సులు తీసుకొస్తున్న సిబ్బంది

టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ. ★★★

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో టిడిపి, పిడిఎఫ్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. గెలుపుపై ఎవరి అంచనాలు వారు వేస్తున్నారు. ఎవరికివారు గెలుపుపై ధీమాగా ఉన్నారు. తొలి రెండు, మూడు రౌండ్లలో ఫలితా న్ని బట్టి ఎవరు గెలుస్తా రనేది అంచనాకు వచ్చే అవకాశం ఉంది. టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం, పిడిఎఫ్ అభ్యర్థి డివి.రాఘవులు కౌంటింగ్ హాలులోనే ఉన్నారు.

భారీ బందోబస్తు ★★★

ఏలూరు స్పోర్ట్స్: ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. కౌంటింగ్ హాలు వద్ద భద్రతను ఆరుగురు డిఎస్‌పిలు, ఆరుగురు సిఐలు, 22 మంది ఎస్‌ఐలు, 38 మంది ఎఎస్‌ఐలను, 55 మంది కానిస్టేబుళ్లను, 37 మంది హోం గార్డులను నియమించినట్లు తెలిపారు. ఎస్‌పి వెంట ఎఎస్‌పి సూర్యచంద్రరావు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు తాగునీటి వ్యవస్థలు మరమ్మతులు చేపట్టి పూర్తి చేస్తూ ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్లు మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. సిపిడబ్ల్యుఎస్ స్కీముల పనితీరు, గోదావరి తీరంలో పరీవాహక నీటి ద్వారా తాగునీటి ఏర్పాట్లు, బోరుబావుల మరమ్మతులు, వేసవి స్టోరేజీ ట్యాంకులు నింపడం, వేసవి కార్యాచరణ ప్రణాళికలు, తాగునీటి వ్యవస్థల మరమ్మతుల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఏ ఒక్క తాగునీటి సమస్యా ఉత్పన్నం కాకుండా తాగునీటి వ్యవస్థల రిపేర్లపై అంచనాలు రూపొందించి సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి అనుమతులు తీసుకోవాలన్నారు. ఆ మరమ్మతులను పూర్తి స్థాయిలో చేపట్టి వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. కాలువ చివరి గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్న చోట్ల ట్యాంకర్ల ద్వారా ఒఎన్‌జిసి సిఎస్ఆర్ ఆర్థిక సాయంతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వేసవి స్టోరేజ్ చెరువుల ద్వారా నీటి చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా 26 సామాజిక రక్షిత తాగునీటి పథకాలు 17 పరీవాహక నీటి సరఫరా పథకాలు మూడు బోర్ వెల్స్ ఉన్నాయన్నారు. అవసరమైతే రానున్న వేసవి దృష్ట్యా వీటి సామర్థ్యాలను పెంచాల్సిన ఆవశ్యకతను ఇంజనీర్లు గుర్తించి ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. కాలువలను మూసివేసేనాటికి 43 వేసవి స్టోరేజ్ చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. రానున్న మూడు మాసాల్లో ఏ విధమైన తాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నమైనా వాటికి సంబంధిత ఇంజనీర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన ఆదేశించారు. ప్రతి పక్షం రోజులకు విధిగా ఓవర్ హెడ్ ట్యాంకులను క్లీనింగ్ చేయాలని అదే విధంగా నీటి శుద్ధి నాణ్యత పరీక్షలను కూడా క్రమంతప్పక నిర్వహిస్తూ కెమికల్ పారామీటర్లు బయోలాజికల్ పారా మీటర్లను ల్యాబ్‌ల సహకారంతో పరిశీలించి నాణ్యమైన తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఎక్కడా లీకేజీ సమస్యలు లేకుండా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాను ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. వేసవి దష్ట్యా వీటిని పొదుపుగా వాడుకోవాలని, తాగునీటిని వథా చేయకుండా అవసరం మేరకే వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం ఇంజనీర్లు మున్సిపల్ కమిషనర్లు విఐపి.నాయుడు, కెవిఆర్.రాజు, టివి.రంగారావు, రవి వర్మ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తరగతుల విలీనాన్ని నిలిపి వేయాలి

ప్రజాశక్తి - అల్లవరం

అల్లవరంలోని మండల పరిషత్ ప్రత్యేక ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులను అల్లవరం హైస్కూల్ పక్కన ఉన్న అభ్యుదయ పాఠశాలకు తరలించాలన్న విద్యాశాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులు తీర్మానం చేశారు. అభ్యుదయ పాఠశాలకు విద్యార్థులు వెళ్ళాలంటే సుమారు రెండు కిలోమీటర్లు మెయిన్ రోడ్డులో ప్రయాణించాలని, విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికావచ్చని, విద్యార్థుల రాకపోకల సమయంలో అనేక వాహనాలు, కాలేజీ, స్కూల్స్ చెందిన బస్సులు, దారి పొడవునా కుక్కలు, ఆబోతుల వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వరరావు, ఎన్.సత్యవాణి, పి.దుర్గాభవాని, వెంకటలక్ష్మి, ఎస్‌కె.సుభాని, బికె.అలివేలు, దివ్యజ్యోతి, దుర్గ, ఆదిలక్ష్మి, సూర్యకుమారి, గుర్రం రాజ్యలక్ష్మి, జె.ఇందిర, రాచూరి దుర్గ స్థానికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

ఆశా వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను వెంటనే జిఒల రూపంలో అమలు చేయాలని, ఆశ వర్కర్లకు వేతనాలు పెంచాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా అమలాపురం సిఐటియు ఆఫీసులో సోమవారం జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవాధ్యక్షురాలు కె.కృష్ణవేణి మాట్లాడుతూ గత ప్రభుత్వం వేతనాలు పెంచుతామని, గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పిస్తామని హామీ ఇచ్చి జిఒ ఇవ్వలేదని, ఆ సందర్భంలో టిడిపి తాము అధికారంలోకొస్తే వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా వేతనాలు పెంచలేదని తెలపారు. ఈ సమస్యల పరిష్కారానికి విజయవాడలో ఈ నెల 6న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాషిణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రాడ్యుటీ, వయోపరిమితి పెంపు, వేతనంతో కూడిన మెటర్నటీ లీవు ఇవ్వడం సంతోషమే, కానీ జిఒలు అమలు చేయాలని, వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి.సీతారత్నం, బి.ఈశ్వరి, డి.వరలక్ష్మి, రాణి, దుర్గా, మేరీ, సిహెచ్.దుర్గ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

బాలయోగికి ఘన నివాళి

లోక్‌సభ మాజీ స్పీకర్ జియంసి బాలయోగి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లావ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం అమలాపురం నల్లవంతెన సమీపంలోని బాలయోగి ఘాట్ వద్ద సోమవారం బాలయోగి తనయుడు అమలాపురం ఎంపీ జిఎంసి హరీష్ బాలయోగి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమలాపురం పార్లమెంటు పరిధిలోని వృద్ధ, అనాథ, వికలాంగ ఆశ్రమాలలో హరీష్ బాలయోగి ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. అమలాపురం బాలయోగి ఘాట్‌లోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులు అర్పించారు. వీరిలో కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

అంబాజీపేట దేశవ్యాప్తంగా కోనసీమ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన నాయకుడు జిఎంసి.బాలయోగి ఆదర్శనీయుడని టిడిపి కో కన్వీనర్ డివివి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు సెంటర్‌లో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు దంతులూరి శ్రీను రాజు, గూడాల ఫణి ఆధ్వర్యంలో సోమవారం బాలయోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు మాట్లాడుతూ సామాన్య న్యాయవాది వృత్తి నుండి అత్యున్నత పదవి లోక్‌సభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టి ప్రజల మన్నులు పొందిన గొప్ప నాయకుడు బాలయోగి అన్నారు. సొసైటీ మాజీ అధ్యక్షులు గణపతి వీరరాఘవులు మాట్లాడుతూ బాలయోగి భౌతికంగా లేకపోయినప్పటికీ అభివద్ధి రూపంలో నిత్యం మనకు కనిపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి శ్రీనివాస రావు, అరిగెల బలరామూర్తి, దొమ్మేటి సాయికృష్ణ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, రమణం రాము, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, కాసా నాగమల్లేశ్వరరావు, కొర్లపాటి గోపి, ఎం.తాతాజీ, దొమ్మేటి రామారావు, కుడిపూడి రాంబాబు, తిరుమనాధం వీర హనుమంతురావు, నేదునూరి కల్యాణ్, మంద రాజేష్, అధికారపు బాబ్జి, కత్తుల బాబులు, పత్తి దత్తుడు, నేదునూరి రాజ్ కుమార్, గుబ్బల రమణ, కె.ఈశ్వరరావు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.

ముమ్మిడివరం జిఎంసి బాలయోగి చిరస్మరణీయుడని మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద కొనియాడారు. ముమ్మిడివరం నగర పంచాయతి పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా, లోక్ సభ స్పీకర్‌గా బాలయోగి నిరంతరం కోనసీమ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. యానాం-ఎదుర్లంక బ్రిడ్జి, కత్తిపూడి- పామర్రు 216 జాతీయ రహదారి, కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ సాధనకు స్పీకర్‌గా ఎంతో కృషి చేశారన్నారు. నేటి తరం నాయకులకు బాలయోగి స్ఫూర్తిదాయకం అన్నారు. బాలయోగి ఆశయ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణ కుమార్, తాడి నరసింహారావు, పిల్లి నాగరాజు, చిక్కాల అంజింబాబు, గొల్లపల్లి గోపి, అర్ధాని శ్రీనివాస రావు, మటద్ద సత్తిబాబు, మెండి కమల, కుడిపూడి మల్లేశ్వరి, ముమ్మిడివరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

అమలాపురంలో బాలయోగి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ హరీష్

మామిడికుదురు బాలయోగి సేవలు చిరస్మరణీయమని జెడ్‌పి మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్లో బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్లేటి శ్రీనివాస్, గంధం భాస్కరరావు, తులా బ్రహ్మాజీ, వర్జినేని వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట కొత్తపేట బస్టాండ్ సెంటర్లో బాలయోగి విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కర్ రావు, పాలూరి సత్యానందం, బీర ఇసాక్, పెనుమళ్ల అన్నవరం, కాశి ధనరాజు, బండిరాజు, బూసి వెంకటరమణ, దూనబోయిన నారాయణ, ప్రసాద్, ముత్యాల బాబ్జి, చోడపనీడి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -ఐ.పోలవరం, ముమ్మిడివరం

పాతఇంజరం గ్రామ పంచాయితీ వడ్డి చెరువు వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్, హైస్కూల్లో బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలతో బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సూపవైజర్ నాగలక్ష్మి, అంగన్వాడీ టీచర్ పద్మ, బాల బాలికలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.పల్లవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని ఆనాతవరం ప్రభుత్వ పాఠశాలలో మహిళా శిశ సంక్షేమ శాఖ, పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహల వల్ల కలిగే అనర్థాలపై వివరిస్తూ విద్యార్థినిలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పల్లవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలంతా విద్యావంతులైనప్పుడే అణచివేత, వివక్షలను పారదోలవచ్చునన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడదామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎస్‌ఎన్.దేవి, భవాని, మాణిక్యాంబ, రాజేశ్వరి, నాగలక్ష్మి, సత్యకుమారి, ఉమామహేశ్వరి, హెచ్‌ఎం పి.రమణి కుమారి, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్.రామ్‌జీ పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక బుట్టగరగ ఉత్సవం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పినపళ్లలో శ్రీనూకాంబిక అమ్మవారికి సోమవారం అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చింతలూరులో ఉన్న గ్రామదేవత శ్రీనూకాంబిక అమ్మవారి గ్రామాల్లో పర్యటనలో భాగంగా వాయిద్యాల నడుమ బుట్టగరగ రూపంలో మూడవ రోజు స్థానిక పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా బుట్ట గరగను నెత్తిన ధరించిన ఆలయ ఆసాదుల పాదాలను మహిళలు పసుపు నీళ్లతో కడిగి నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమలను అందజేశారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ నెల 13 వరకూ మండలంలోని వివిధ గ్రామాల్లో అమ్మవారు బుట్టగరగ రూపంలో గ్రామోత్సవం జరుగుతాయని ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు.

పినపళ్లలో నూకాంబిక అమ్మవారి బుట్టగరగ గ్రామోత్సవం

ఇసుక అక్రమ తవ్వకాలపై తనిఖీలు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక తనిఖీలు చేపడుతూ ఇసుక అక్రమ తరలింపు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా నిరోధించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనసీమ జిల్లాలో భవన, రోడ్ల నిర్మాణ రంగాల డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా చేస్తూ స్టాక్ పాయింట్లలో వర్షాకాలంలో భవన నిర్మాణాలకు అవసరమైన సుమారు 25 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయాలని ఆదేశించారు. అనధికారకంగా గోదావరి నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రతికూల వార్తలు వస్తున్న నేపథ్యంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. సెమీ మెకనైజ్డ్ రీచులలో వారం రోజుల్లో ఇసుక తవ్వకాలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇసుక తవ్వకాల కోసం ఐదు రీచ్‌లను ప్రతిపాదించి ప్రజాభిప్రాయాన్ని సేకరించామని,వీటి పర్యావరణ అనుమతుల కోసం కాలుష్య నియంత్రణ మండలి జిల్లా స్థాయి అధికారి కృషి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్న రీచులలో గుర్తించిన ఇసుక నిల్వల కోసం పూర్తిగా తవ్వకాలు నిర్వహించి స్టాక్ పాయింట్లలో నిల్వ చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం జిల్లా యంత్రాంగం జిల్లాలో భవన నిర్మాణాల వరకు ఒక రీచ్‌ను కేటాయించాలని కోరిందని, ఆ మేరకు పొడగట్లపల్లి ఇసుక రీచును విశాఖపట్నం జిల్లా భవన నిర్మాణ రంగానికి కేటాయిస్తారని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు టాస్క్ ఫోర్స్ బందంలో సభ్యులుగా ఉన్న రవాణా పోలీసు రెవెన్యూ అధికారులు వారానికి కనీసం రెండుసార్లు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. స్థానిక వినియోగదారులు బల్క్ వినియోగదారులకు ఒక క్రమ పద్ధతిలో ఇసుకను సరఫరా చేయాలని, ఎక్కడా ఇసుక సరఫరాలో లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఎల్.వంశీధర్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు. కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజనీర్ శంకర్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కృష్ణారెడ్డి, డిపిఒ శాంతలక్ష్మి, మత్స్యశాఖ జిల్లా అధికారి ఎన్.శ్రీనివాసరావు, రియాల్టీ ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

ఎంపిపి పాలెపు లక్ష్మి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

కాట్రేనికోన ఎంపిపి పాలెపు లక్ష్మి(56) సోమవారం ఆసుప్రతిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఆమె మృతితో పల్లం, కాట్రేనికోన, కర్రివానిరేవు గ్రామ పంచాయతీలలో విషాదఛాయలు అలముకున్నాయి, ఆమె భర్త పాలెపు ధర్మారావు వైసిపి నాయకుడు. వారికి ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. ఎంపిపి లక్ష్మి మృతి పట్ల మాజీ ఎంఎల్‌ఎ సతీష్ కుమార్, పితాని బాలకృష్ణ, జెడ్‌పిటిసి నేల కిషోర్ కుమార్, నల్లా నరసింహమూర్తి, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, సంసాని నాగేశ్వరరావు, పల్లం సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి, కాశి హనుమంతరావు, గెద్దాడ గుణ వేణుకుమార్ లక్ష్మి భర్త ధర్మారావుని ఓదార్చారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.15 వేల విరాళం

మామిడికుదురు : అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆచంట వాసులు నక్కింటి వెంకట్రావు అంజలీదేవి కుటుంబ సభ్యులు సోమవారం రూ.15 వేలు విరాళం అందజేశారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు.

మొక్కజొన్నకు మద్దతు ఏదీ?

ధర లేక రైతుల దిగాలు
ఆదుకోవాలంటున్న అన్నదాతలు

ప్రజాశక్తి- గోకవరం

మొక్కజొన్న పంటకు మద్దతు ధర దూరమైంది. ధరలేకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తమను ఆదుకోవాలని, లేకుంటే అప్పుల్లో కూరుకుపోతామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజన్సీ ముఖద్వారమైన గోకవరం మండలంలో 1,989 ఎకరాల్లో రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల రీత్యా ఈ ఏడాది ఎకరాకు 2, నుంచి 3 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. గతంలో ఎకరాకు 5 టన్నుల వరకూ పంట చేతికొచ్చేది. ఈ ఏడాది దిగుబడి తగ్గడం, ధర కూడా లేకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరకుపోయే ప్రమాదం ఉంది. కనీసం పెట్టుబడులైనా వస్తాయో రావో తెలియని పరిస్థితి.

రవాణాకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న బస్తాలు

ఎకరాకు రూ.85 వేల వరకూ పెట్టుబడి

ఎకరా మొక్కజొన్న పంటను పండించడానికి కౌలు రైతుకు ఎకరాకు రూ.85 వేల నుంచి రూ.90 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. మండలంలో మొక్కజొన్నను ఎక్కువ మంది రైతులు కౌలుకు తీసుకునే పండిస్తున్నారు. ఎకరానికి కౌలు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఉంది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు కలిపి మరో రూ.40వేల వరకూ ఖర్చు అవుతంది. మొత్తంగా రూ.85 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఎకరాకు 2 నుంచి 3 టన్నుల వరకూ మొక్కజొన్న దిగుబడి వస్తుంది. ప్రస్తుతం టన్ను మొక్కజొన్నకు రూ.23వేలు మాత్రమే ఇస్తున్నారు. ఈ లెక్కన మూడు టన్నులకు కలిపి రూ.69 వేలు మాత్రమే వస్తుంది. అంటే పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి. పెట్టుబడులు రాకపోక రైతుకు ఎకరాకు రూ.16వేల వరకూ నష్టం వాటిల్లింతుంది. టన్నుకు కనీసంగా రూ.30వేలు అయినా ఇవ్వాలని, అప్పుడే తాము గట్టెకుతామని రైతులు కోరుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ఈ ఏడాది అసలు మద్దతు ధర కూడా లేదు. దీంతో రైతులు అప్పులపాలవుతారు. మొక్కజొన్న రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలి. వాతావరణం ప్రతికూలంగా ఉండటంతో ఈ ఏడాది దిగుబడి కూడా పడిపోయింది. తెగుళ్ల కారణంగా పెట్టుబడి కూడా పెరిగింది. వివిధ కంపెనీల యాజమాన్యాలు, ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న రైతులను ఆదు కోవాలి.

- ఎం.సూర్యనారాయణ, కౌలు రైతు

పెట్టుబడి ఖర్చు పెరిగింది

మొక్కజొన్న పంట పండించాలంటే పెట్టుబడి ఎక్కువగా అవుతుంది. సగం పెట్టుబడి కౌలుకే సరిపోతుంది. కౌలు తగ్గించి, కనీస ధర పెంచితే రైతులకు కొంతవరకు ఊరట లభిస్తుంది. ఒక్కో కంపెనీ ఒక్కొక్క రేటు ఇస్తుందని, యాజమాన్యం కూడా రైతు నష్టపోకుండా కనీస ధర ఇప్పించాలి, ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.

- జి.శేషగిరి, కౌలు రైతు

'కర్రి తాతారావు ఆగడాలను అరికట్టాలి'

తనపై జరిగిన దాడి గురించి వివరిస్తున్న విష్ణు, స్థానికులు

ప్రజాశక్తి-మండపేట

టిడిపి కేశవరం గ్రామ అధ్యక్షుడు కర్రి తాతారావు ఆగడాలకు అంతు లేకుండాపోయిందని అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ సేవా సమితి అధ్యక్షుడు, టిడిపి నాయకుడు పెదపాటి విష్ణు ఆరోపించారు. కేశవరంలోని తన స్వగృహంలో విష్ణు మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో తాతారావు ఆయన అనుచరులు చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారని, గ్రామ అభివృద్ధిపై ఎవరు మాట్లాడినా విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో గంజాయితో యువత పాడైపోతోందని విమర్శలు వచ్చాయని, కానీ తాతారావు ఎవరైనా గ్రామాభివృద్ధిపై ప్రశ్నిస్తే తన అనుచరులకు గంజాయి, మద్యం సరఫరా చేసి దాడులు చేయించడం దారుణం అన్నారు. గత నెల ఫిబ్రవరి 23న తాను తన వైద్యశాల వద్ద ఉండగా తాతారావు సుమారు 25 మంది అనుచరులతో వచ్చి క్రికెట్ బ్యాట్లు, రాడ్లతో తనపై దాడి చేసి, తాను చనిపోయాను అనుకుని వదిలేసి వెళ్లారన్నారు. అంతేకాక గంజాయి మత్తులో ఉన్న వారు వారి చేతులను కోసుకొని వారిపై తాను దాడి చేశానని స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు తాను కూడా ఫిర్యాదు చేశారన్నారు. టిడిపిలో సొంత పార్టీ నాయకులకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ఆసుపత్రి నుంచి ఆదివారం ఇంటికి వచ్చిన తాను మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. పెదపాటి విష్ణు భార్య రాజేశ్వరి మాట్లాడుతూ కర్రి తాతారావు అతని అనుచరులు వల్ల తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలరని కోరారు. తన భర్త చేతి ఉంగరాలు, బ్రాస్‌లెట్, సెల్‌ఫోన్ తీసుకుపోయారని తెలిపారు. ఈ సమావేశంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌డిడబ్ల్యుసిలను సమర్థవంతంగా నడిపించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి గ్రామంలో ఉన్న సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పార్కులను సమర్థవంతంగా నడిచేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఐ.రాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎస్‌డిడబ్ల్యుసి వద్ద ఆయన కార్యదర్శులకు సోమవారం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ పారిశుధ్య కార్మికులకు సహకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరణదారులకు అందజేయాలని సూచించారు. ఎస్‌డిడబ్ల్యుసిలో వర్మి కంపోస్ట్ తయారీలో సూక్ష్మ దృష్టితో పని చేయాలన్నారు. తయారైన వర్మి కంపోస్టును జాగ్రత్తగా సేకరించి కావాల్సిన వారికి విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మోక్షంజలి వెంకటరత్నం, వీరమాత, వెంకట రమణ, సుభాష్, వి.వేణి, ఎస్.వీర్రాజు పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట, సామర్లకోట

మండలంలో ఇంటర్ సెకెండియర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పేపర్ 1 పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో మొత్తం 374 మందికి 361 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. అక్షరా కళాశాలలో 125 మందికి 122 మంది, గురుకుల పాఠశాలలో 262 మందికి 252 మంది పరీక్ష రాశారు. సామర్లకోట మండలంలో ఇంటర్ సెకెండియర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో పరీక్షలు రాసే రెగ్యులర్ విద్యార్థులు 231 మంది, ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ విద్యార్థులు 226 మంది, ప్రయివేటు విద్యార్థులు 24 మంది వెరసి 481 మంది ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ రాజేశ్వరరావు చెప్పారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆసుపత్రిలో పనులు ఏమేమి మంజూరు అయ్యాయి? ఎంతవరకు పూర్తి అయ్యాయి? ఎప్పటికీ పూర్తి అవుతాయి? వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎపి ఎంఎస్ఐడిసి ఇఇ సిహెచ్.రత్నరాజు,డాక్టర్ ఎస్.స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కృపానందంను సత్కరిస్తున్న నాయకులు

ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా కృపానందం

ప్రజాశక్తి - తుని

తుని నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా తుని రూరల్ మండలం లోవకొత్తూరు గ్రామానికి చెందిన లంక కృపానందం ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ప్రకటించారు. ఈ సందర్భంగా కపానందం మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో తన నియోజకవర్గ స్థాయిలో పదవిని కట్టబెట్టిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎస్‌సిలకు అన్యాయం జరిగినా వారి పక్షాన పోరాడతానని అన్నారు.ఈ సందర్భంగా కోటనందూరు మండల వైసిపికి చెందిన సర్పంచులు గరిసింగు దొరబాబు, జగటాల వీరబాబు, కో ఆప్షన్ సభ్యులు జగటాల కోటసత్తిబాబు, ఎంపిటిసి సభ్యులు కొత్తపెల్లి మాణిక్యాలరావు, వైసిపి మండల ఉపాధ్యక్షులు అనుకూల రిసార్డ్ సామ్యేల్, తదితరులు కృపానందాన్ని సత్కరించారు.

పలుచోట్ల పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - శంఖవరం, పెద్దాపురం

శంఖవరంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా లేగ దూడల ప్రదర్శన, పశువులకు గర్భకోశ వ్యాధులపై పశువైద్యాధికారులు పశువులను పరీక్షించారు. దూడలకు కాల్షియం, లివర్ టానిక్స్, మినరల్ మిక్సర్ బ్లాక్స్, పాల క్యాన్స్ ప్రోత్సాహక బహుమతులుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీతల మనోజ్‌కుమార్, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, డాక్టర్ కె.ప్రసాద్, డాక్టర్ టి.లావణ్య, డాక్టర్ ఎం.వీరరాఘవరావు, డాక్టర్ సిఆర్.విభ, పశుగణాభివృద్ధి సంస్థ వైద్యులు డాక్టర్ కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని జి.రాగంపేటలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశుసంవర్ధక శాఖ జెడి ఆర్.వెంకటేశ్వరరావు, డిడి అంబేద్కర్, ఎడిటి ఎ.రామస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో పశు వైద్యాధికారి మస్తాన్ బి, సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే దూడలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పి.దుర్గాప్రసాద్, పి.గంగరాజు, కె.రాజు, పి.ప్రదీప్, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - గండేపల్లి, కరప

మండలంలో అన్ని గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు సిబ్బంది పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఎల్‌పిఒ బాలమణి అన్నారు. సోమవారం మండలంలోని నీలాద్రిరావుపేటలో చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే పారిశుధ్యంపై ప్రత్యేకమైన దృష్టి సారించాలన్నారు. మార్చి నెలాఖరుకి ఇంటి, కులాయి పన్నులను 90 శాతం వసూలు చేయాలని, లేనిపక్షంలో సిబ్బందికి సోకజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, కార్యదర్శులు పాల్గొన్నారు. కరప మండలంలో ఇంటి పన్నులు 100 శాతం వసూలు చేసే విధంగా కార్యదర్శులు కృషి చేయాలని ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు ఆదాయ వనరులుగా ఉన్న ఇంటి, పన్నోతర వసూళ్ల త్వరతగతిన వసూలు చేయాలన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాలకు చెత్తను తరలించి కంపోస్ట్ తయారీ, డ్రెయినేజీలు పూడికతీతలు, వీధులు పరిశుభ్రత, డ్రింకింగ్ వాటర్ పనితీరు మొదలగు అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నిర్మాణంలో ఉన్న ఇల్లు కూల్చివేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన మెండి గంగారావు ఇంటిని నిర్మించుకుంటున్నాడు. దీంతో కొందరు ఆ ఇంటిపై దాడి చేసి జెసిబితో కూల్చేశారు. దీంతో గంగారావు దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చంపేట పాత రామాలయం వీధిలో ఓ గుడిసెలో కొన్నేళ్లుగా ఈ దంపతులు జీవనం సాగిస్తున్నారు. గుడిసె స్థానంలో పక్కా గృహాన్ని నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం ఆ గృహం శ్లాబ్ దశకు చేరుకుంది. అయితే ఆదివారం ఆకస్మాత్తుగా ఈ స్థలం తమదంటూ గ్రామానికి చెందిన పలువురు వచ్చి వారిపై దాడి చేయడంతోపాటు, శ్లాబ్ సెంట్రింగ్ పనుల కోసం అమర్చిన కర్రలను కూలగొట్టారు. ఇదేమని ప్రశ్నించిన తమపైనా దాడి చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తున్న వారిపైనా దాడిచేసి సెల్ఫోన్ లాక్కొని నేలకేసి కొట్టేశారు. ఈ ఫిర్యాదుపై సిఐ కృష్ణ భగవాన్ ఆదివారం రాత్రి సంఘటనా ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.

వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మహిళా సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ ఎ. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని చేబ్రోలు చైతన్య గోదావరి బ్యాంక్‌లో సోమవారం లబ్ధిదారులకు రుణమేల కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బ్యాంక్ నుంచి 110 మంది మహిళా సంఘ సభ్యులకు రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులను వ్యాపారవేత్తలుగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం రుణాలను మంజూరు చేస్తుందన్నారు. బ్యాంకు నుంచి ప్రతి మహిళకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆర్‌ఎం గంటా శ్రీనివాసరావు, డిపి ఎపిఎం ఆర్.సన్యాసిరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

హత్య కేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

2021లో సిటిఆర్ఐ వద్ద జరిగిన హత్య కేసులో నిందితుడు యర్రా సాయికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రాజమహేంద్రవరం సిటిఆర్ఐకు చెందిన జీరి వెంకటతోటయ్యరెడ్డికి, యర్రా సాయికి పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపత్యంలో 2021 సెప్టెంబర్ 25వ తేదీ తెల్లవారు జామున యర్రా సాయి చాకుతో తోటయ్యరెడ్డిపై దాడికి దిగాడు. చాకుతో పొడిచి పక్కనే ఉన్న సర్వే కర్రతో తలపై బలంగా కొట్టాడు. అనంతరం రాయితో మోది హత్య చేశాడు. దీనిపై త్రీటైన్ పోలీస్ స్టేషన్‌లో సిఐ మదుబాబు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఛార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితునికి జీవిత ఖైదు, రూ.20 వేల జరిమానా, జరిమానా కట్టని పక్షంలో మరో 6 నెలలు సాధారణ జైలు శిక్ష విధించారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అడిషనల్ పిపి కె.రాధా కృష్ణరాజు, 3 టౌన్ సిఐ వర్రి అప్పారావు, కానిస్టేబుల్ జి.వెంకటేశ్వర్లును ఎస్‌పి డి.నరసింహకిషోర్ అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామ పరిధిలోని పోలవరం కాలు వద్ద గుర్తుతెలియని మృతదేహం లభించింది. సోమవారం సంఘటనా స్థలాన్ని ఎస్‌పి బిందు మాధవ్, డిఎస్‌పి పాటిల్ దేవరాజ్‌మనీష్, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ ఎన్.రామకృష్ణ సందర్శించారు. మతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు ఎస్‌క్షి, సిఐలకు తెలియ చేయాలని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. 2 రోజుల క్రితం ఎక్కడో హత్య చేసి ఈ ప్రాంతంలో మృతదేహాన్ని పడవేసినట్లు తెలుస్తోంది.

అక్రమ మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - అంబాజీపేట, రావులపాలెం

పి.గన్నవరం, రాజోలు సర్కిల్ పరిధిలో స్వాధీనం చేసుకున్న రూ.90 లక్షల విలువైన మద్యాన్ని అంబాజీపేట మార్కెట్ యార్డులో సోమవారం ధ్వంసం చేశారు. కొత్తపేట డిఎస్‌పి ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కెడివి.ప్రసాద్ సమక్షంలో ఈ అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశారు. అనంతరం డిఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటి వరకు ఏడు పోలీస్ స్టేషన్ల పరిధిలో 9,124 అక్రమ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి పి.ప్రదీప్తి, పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు, రాజోలు సిఐ నరేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రావులపాలెం గతంలో స్వాధీనం చేసుకొన్న మద్యం, సారాను సిఐలు సిహెచ్.విద్యాసాగర్, ఎం.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. రూ.15 లక్షల మద్యాన్ని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు జి.సురేంద్ర, కె.అశోక్, ఎం.రాము, రెవెన్యూ అధికారులు కొండేటి సత్యప్రసాద్, చింతపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు 15 మందికి గైర్హాజరు

ప్రజాశక్తి - తాళ్లపూడి, చాగల్లు

సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షకు తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 15 మంది విద్యార్థులు గైర్హాజర్యారు. తాళ్లపూడిలో 11 మంది విద్యార్థులు గైర్హజరయ్యారని ఎగ్జామ్ ఛీఫ్ గౌరీనాథ్ తెలిపారు. వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 205 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 194 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

చాగల్లు శ్రీవెలగపూడి రామకష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం 101 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా నలుగురు విద్యార్థులు పరీక్షలు గైర్హాజరు అయినట్లు 97 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కే పావని తెలిపారు. పరీక్షా కేంద్ర వద్ద సిటింగ్ స్క్వాడ్ పెట్టినట్టు ఆమె తెలిపారు

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని తాడిపూడి గ్రామంలో ఐదుగురు యువకులు గోదావరిలో పడి మృతి చెందారు. వీరి కుటుంబాలను కాపు జెఎసి రాష్ట్ర నాయకులు గట్టి గురునాథం తదితరులు సోమవారం పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడారు. ఘటన జరిగి ఆరు రోజులైనా నేటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.25 లక్షల రూపాయల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు చిన్న చిన్న సంఘటనలపై తక్షణం స్పందించిన ఉప ముఖ్యమంత్రి జనసేన నాయకులు పవన్ కళ్యాణ్ నేటి వరకు యువకుల మృతిపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో తోట రామకృష్ణ, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, తాడిపూడి సర్పంచ్ నామా గోపాలం, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షులు నామా ప్రకాశం, జిల్లా నాయకులు పోసిన శ్రీకృష్ణదేవరాయలు, కరిబండి త్రినాథస్వామి, వనిమిరెడ్డి శ్రీను, మండిగ గిరి పాల్గొన్నారు.

లింగ సమానత్వంపై వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవరపల్లిలో గల భాష్యం స్కూల్లో విద్యార్థులకు లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పురుషుల ఆవశ్యకత, పితృస్వామ్య వ్యవస్థలో ఎదురయ్యే సవాళ్ళు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవరపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, స్కూల్ యాజమాన్యం, ఎఎస్ఐ కె.నాగభూషణం, మహిళా కానిస్టేబుల్ విజయశ్రీ పాల్గొన్నారు

కడియం మసీదులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కడియం

రంజాన్ మాసం నేపథ్యంలో కడియంలోని మసీదులో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కమిటీ ప్రెసిడెంట్ షేక్ సలీం, సెక్రెటరీ సర్కార్ భాషా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం మసీదులో ముస్లింలు పెద్దలతో కలిసి ప్రత్యేక నమాజ్ చేశారు. ఈ సందర్భంగా షేక్ సలీం మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో ఉపవాసాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలో ముస్లిములు, మత పెద్దలు పాల్గొన్నారు.

కొనగళ్ల భాస్కరరావుకు సతీవియోగం

ప్రజాశక్తి-మండపేట

కాపు నాయకుడు, వైసిపి సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొనగళ్ళ భాస్కరరావు సతీమణి సూర్యప్రభ (70) సోమవారం కన్నుమూశారు. ఈమెకు కుమారుడు రాజేష్, కుమార్తె చంద్రిక ఉన్నారు. సూర్యప్రభ కోరిక మేరకు తన కళ్ళను దానం చేశారు. కాకినాడ బాదం బాలకష్ణ ఐ బ్యాంక్ బృందం మండపేట చేరుకుని ఆమె రెండు నేత్రాలను సేకరించి ఐ బ్యాంక్‌కు తరలించారు. ఆమె మృతి పట్ల ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, ప్రముఖులు రెడ్డి రాధాకృష్ణ, పోతంశెట్టి వర ప్రసాద్, జిన్నూరి సత్యసాయిబాబా, ఉంగరాల రాంబాబు, అధికారి శ్రీనివాస్, మెండు బాపిరాజు సంతాపం తెలిపారు.

పాదరక్షలు అందజేసిన సర్పంచ్ బుల్లియ్య, రమణారావు

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి విద్య నేర్పించాలని గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు కుంచే రమణారావు సూచించారు. గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలోని 33 మంది చిన్నారులకు సోమవారం స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య (బాబాయ్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుడ్ సీడ్ ఫౌండేషన్ తరపున పాదరక్షలు సాక్స్‌లను చైర్మన్ రమణారావు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేదల విద్య వైద్యం కోసం రమణారావు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు, గ్రామ పెద్దలు అయితాబత్తుల వెంకట కృష్ణారావు, ఒగూరి విజయ్ కుమార్, కుంచే బాబులు, నేరేడిమిల్లి శ్రీనివాసరావు, పందిరి సుబ్బరాజు, అంగన్‌వాడీ టీచర్లు గోసంగి బేబీ కుమారి, కుంచే దుర్గా భవాని, సిబ్బంది భారతీదేవి, సాయి దుర్గ, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నియామకం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం జడ్‌పి హైస్కూల్లో మరుగుదొడ్లు పరిశుభ్రం చేసేందుకు ఇద్దరు కార్మికులను అధికారులు నియమించారు. మరుగుదొడ్లను శుభ్రం చేసే కార్మికురాలు జీతం సరిపోవడం లేదంటూ పని నుంచి వెళ్లిపోయింది. దీంతో గత 20 రోజులుగా మరుగుదొడ్లు శుభ్రం చేసిన పరిస్థితి లేకుండా పోయింది. దీంతో పారిశుధ్య కార్మికులను నియమించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంఇఒ, స్థానిక కూటమి పార్టీల నాయకులు, ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. 300 మంది విద్యార్థులుంటే ఇద్దరు కార్మికులను నియమిస్తామని, ఆ లోపు ఉంటే ఒక కార్మికుడినే నియమించాలనే నిబంధన ఉందని ఎంఇఒ సమావేశం దృష్టికి తెచ్చారు. ఒక కార్మికుడికి రూ.6 వేలు మాత్రమే ప్రభుత్వం ఇస్తుందన్నారు. దీంతో మరో కార్మికునికి అవసరమైన జీతాన్ని గ్రామస్తుల నుంచి చెల్లిస్తామని కూటమి పార్టీల నాయకులు తెలిపారు. దీంతో గతంలో పనిచేసిన కార్మికురాలితోపాటు, మరో కార్మికురాలిని గ్రామస్తులు నియమించుకున్నారు. ఈ సమావేశంలో సర్వ శిక్షాభియాన్ ఇఇ వెంకటరాజు, ఎంఇఒ ఇ.ప్రభాకర శర్మ, హెచ్ఎం మల్లీశ్వరరావు, ఎస్ఎంసి ఛైర్మన్ చక్రపాణి, మన్యం చిన్న, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం పట్టణంలోని రాజీవ్ మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాల 6, 7 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆహారంలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయారణ్యం సందర్శన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం చొల్లంగిలోని కోరంగి పర్యాటక కేంద్రాన్ని కాకినాడ ఆదిత్య కళాశాల, త్రిపుర రాష్ట్రంలోని మత్స్య కళాశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా విజ్ఞాన యాత్రలో భాగంగా అక్కడికి చేరుకున్న విద్యార్థులకు అటవీశాఖ కాకినాడ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్.వరప్రసాద్ పర్యాటక కేంద్రం, అభయారణ్యంలో ప్రత్యేకతలను వివరించారు. మడ అడవుల ప్రాముఖ్యత, సంచరించే వన్యప్రాణుల వివరాలను ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.మహేష్ వివరించారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సాయి గణపతి ఆటో యూనియన్‌కి చెందిన డ్రైవర్ గొల్లపల్లి సత్యనారాయణ ఆటోలో సామర్లకోటకు చెందిన ఒక ప్రయాణికుడు బ్యాగ్ మరచిపోయి వెళ్లిపోయాడు. ఆ బ్యాగ్‌లో విలువైన సర్టిఫికెట్‌లు, రూ.3600 నగదు ఉన్నట్లు గుర్తించిన డ్రైవర్ ఆ సర్టిఫికెట్లలో ఉన్న ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేసి ఆటో యూనియన్ కమిటీ సమక్షంలో ప్రయాణికుని ఇంటికి వెళ్లి బ్యాగ్‌తోపాటు, నగదుని అప్పగించారు. ఆటో డ్రైవర్ నిజాయితీకి కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రికా ప్రకటన

కీ॥శే॥లు శ్రీమతి సోమాని వెర్రమ్మ
W/o. సుబ్బారావు (లేటు)
కీ॥శే॥లు శ్రీ సోమాని సుబ్బారావు
S/o. గంటయ్య (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, ఓడలరేవు గ్రామ కాపురస్తులు సోమాని సత్యనారాయణ, S/o. సుబ్బారావు గారు వ్రాయించి ఇచ్చిన ప్రకటన.

మా అమ్మగారు సోమాని వెర్రమ్మ ఓడలరేవు గ్రామంలో మా ఇంటి వద్ద 17-03-1996 సంవత్సరం, మా నాన్న గారు 10-04-2000 సంవత్సరంలో ఓడలరేవు గ్రామం మా ఇంటి వద్ద మరణించారు. వీరి ఇరువురి మరణం గ్రామపంచాయతీ రికార్డ్స్‌లో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల 10 రోజుల్లో తెలియజేయగలరు.

ఇట్లు: సోమాని సత్యనారాయణ
S/o. సుబ్బారావు, 8-48, మరిడమ్మ సెంటర్, ఓడలరేవు,
అల్లవరం మండలం, సెల్: 9491436047